

లేగదూడ కళేబరం

## లేగ దూడపై పులి పంజా?

**మేతకు వెళ్లిన ఆవు దూడ కళేబరంగా మారటంతో కలకలం**

**తట్టెపల్లి అటవీ ప్రాంతంలో భయాందోళనలు**

**టైగర్ సంచరిస్తోందని స్థానికుల అనుమానాలు**

**అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వటానికి ప్రయత్నించినా స్పందించలేదని ఆగ్రహం**

**పెద్దేముల్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండలం తట్టెపల్లి అటవీ ప్రాంతంలోని బాయిలొంక ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు స్థానికంగా వార్తలు రావడంతో పరిసరా గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. తాజాగా ఓ లేగ దూడ కళేబరం కనిపించడం, దానిపై అడవి జంతువు దాడి చేసినట్లుగా ఆనవాళ్ళు ఉండటంతో పులి సంచారం ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అటవీ ప్రాంతానికి సమీపంలో మేతకు వెళ్ళిన లేగ దూడ తిరిగి రాకపోవడంతో ఆచూకి కోసం వెతికిన సమయంలో దాని కళేబరం కనిపించినట్లు స్థానికులు చెబుతున్నారు. కళేబరంపై కనిపించిన గాయాలు, పరిస్థితిని పరిశీలించిన కొందరు స్థానికులు పులి లేదా ఇతర అడవి జంతువు దాడి చేసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

**గతం నుంచి పులి సంచారంపై ప్రచారం**

ఇప్పటికే తట్టెపల్లి అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు ప్రచారం జరుగుతుండటంతో ఈ ఘటనకు మరింత ప్రాదాన్యత ఏర్పడింది. అయితే లేగ దూడపై దాడి చేసింది పులేనా, ఇతర వన్యప్రాణా అనే విషయం అటవీ శాఖ అధికారులు నిర్ధారించాల్సి ఉంది. జైరాంతాండాకు చెందిన వ్యక్తికి సంబందించిన లేగ దూడపై పులి దాడిచేసి పీక్కతీన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతుండటంతో స్థానికులు అప్రమత్తమయ్యారు.

**సిసి కెమెరాలు ఏర్పాటుకు డిమాండ్**

అటవీ ప్రాంతంలో జంతువు దాడి చేసినట్లు కనిపిస్తున్న ఆనవాళ్ళు ఉండటంతో స్థానికుల్లో పులి సంచారం అనుమానాలు బలపడుతున్నాయి. దీంతో అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు ఘటన స్థలాన్ని సందర్శించి పశువు కళేబరాన్ని పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. అవసరమైతే పాదముద్రలు, కేమేరా ట్రాప్‌లు, ఇతర ఆనవాళ్ళ ఆధారంగా పులి సంచారం ఉందా లేదా గుర్తించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇట్టి విషయమై అటవీశాఖ అధికారులకు పోన్ చేసిన లిఫ్ట్ చేయలేదు. దీంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



## రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

# వార్త



# మారుమూల నుంచి మోడల్ వైపు..

## సొంత ఊరిపై సిఎం సమ్మోహనం..

**కొడంగల్‌లో రేవంత్ మార్క్ అభివృద్ధి ధమాకా**

**రూ. 43.51 కోట్లతో విద్య, వైద్య, మౌలిక రంగాలు వికాసం**

**ముఖ్యమంత్రి పర్యటనలో సరికొత్త వెలుగులు**

**వైభవంగా మౌలిక వసతుల ప్రారంభోత్సవాలు**

**కొడంగల్, సెప్టెంబరు 5 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో ఆయన సొంత నియోజకవర్గమైన కొడంగల్ ప్రగతి పథంలో వేగంగా దూసుకుపోతోంది. విద్య, వైద్యం, ప్రజా సౌకర్యాలు, ప్రభుత్వ మౌలిక వసతులు... ఈ నాలుగు రంగాల్లోనూ ఒకే రోజు భారీ ఎత్తున అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. శనివారం కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో స్పీకర్ గడ్డం ప్రసాద్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ప్రభుత్వ సలహాదారు కేశవరావులతో కలిసి సీఎం పలు అభివృద్ధి కార్యక్రమాలను ఘనంగా ప్రారంభించారు. కోట్లాది రూపాయలతో అందుబాటులోకి వచ్చిన ఈ నూతన సదుపాయాలు నియోజకవర్గ రూపురేఖలను మార్చనున్నాయి.

**రూ. 8 కోట్లతో మోడల్ స్కూల్ భవనాలు**



విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి వసతులు కల్పించేందుకు సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన పాఠశాల భవనాలను సీఎం ప్రారంభించారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ సహకారంతో జడ్‌పిహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాల, ఎంపిఎస్ బాలికల ప్రాథమిక పాఠశాల భవనాలను అన్ని రకాల ఆధునిక సౌకర్యాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

**రూ. 27 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్**

కొడంగల్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో



అత్యాధునిక క్రిటికల్ కేర్ యూనిట్‌ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి భవనాన్ని పరిశీలించిన ఆయన, పరికరాలు మరియు అత్యవసర వైద్య సేవల తీరుపై అధికారులకు పలు సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు స్థానికంగానే తక్షణ మెరుగైన వైద్యం అందించడం, దూర ప్రాంతాలకు వెళ్లే శ్రమ తగ్గించడమే ఈ యూనిట్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

**రూ. 5 కే కడుపునిండా అన్నం**

ఆసుపత్రికి వచ్చే పేద, మధ్య తరగతి రోగుల సహాయకుల కోసం హరేకృష్ణ ఫౌండేషన్



భాగస్వామ్యంతో రూ. 5కే భోజనం క్యాంటీన్‌ను సీఎం ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం పలువురికి స్వయంగా భోజనం వడ్డించి సర్వ్ చేశారు.



కొడంగల్‌లో రూ.కోటి 85 లక్షల వ్యయంతో నిర్మించిన స్విమ్మింగ్ పూల్



**కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో విద్య, వైద్యం, ప్రజా సౌకర్యాలు, ప్రభుత్వ మౌలిక వసతుల రంగాలకు ఒకేసారి భారీ ఊతాన్నిస్తూ సీఎం వరుస అభివృద్ధి కార్యక్రమాలను ఘనంగా ప్రారంభించారు. కోట్లాది రూపాయలతో నిర్మించిన పలు అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందుబాటులోకి రావడంతో కొడంగల్ రూపురేఖలు మారిపోతున్నాయి. ఆసుపత్రి ప్రాంగణంలో హరేకృష్ణ ఫౌండేషన్ భాగస్వామ్యంతో నిర్వహించే రూ. 5లకే భోజన క్యాంటీన్‌ను సీఎం ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం సీఎం స్వయంగా పలువురు రోగుల సహాయకులకు భోజనం వడ్డించారు.**





సర్వేపల్లికి పుష్పాంజలి

**రూ. 8.51 కోట్లతో అతిథి గృహం**

రూ. 6.80 కోట్ల నిర్మాణ వ్యయం, రూ. 1.71 కోట్ల ఫర్నిచర్ వ్యయంతో సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్న ఆర్ అండ్ బీ నూతన గెస్ట్ హౌస్‌ను ప్రారంభించారు. ఈ భవనం ప్రభుత్వ అధికారిక సమావేశాలు, అధికారుల పర్యటనలకు అత్యంత ఉపయోగకరంగా నిలవనుంది. ముఖ్యమంత్రి పర్యటనతో కొడంగల్ పట్టణంలో పండుగ వాతావరణం నెలకొనగా, అధికారులు భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తాండూర్, పరిగి ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, బుయ్యని మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్ రెడ్డి, అదనపు కలెక్టర్లు ఉమాశంకర్ ప్రసాద్, వెంకటాచారి వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



**కొడంగల్‌లో పండగ వాతావరణం**

సీఎం వరుస ప్రారంభోత్సవాలతో కొడంగల్ పట్టణంలో మునుపెన్నడూ లేని విధంగా కోలాహలం నెలకొంది. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ వైభవంగా జరిగిన కార్యక్రమంలో తాండూర్, పరిగి ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, బుయ్యని మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్ రెడ్డి, అదనపు కలెక్టర్లు ఉమాశంకర్ ప్రసాద్, వెంకటాచారిలతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సీఎస్ఆర్ ప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## చేనేతకు మరింత చేయూత

**పెన్షన్ దరఖాస్తులకు గడువు పొడిగింపు**

**కొత్త పెన్షన్ల దరఖాస్తుల స్వీకరణకు సెప్టెంబరు 15 వరకు అవకాశం : కలెక్టర్**

**రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** చేయూత పెన్షన్ పథకం కింద కొత్త పెన్షన్ల మం జూరు కోసం దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్‌లో వివరాల నమోదు, ధృవీకరణకు సంబంధించి పలు ముఖ్యమైన మార్పులు చేసినట్లు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు. అర్హులైన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఈనెల 15లోపు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని ఆయన సూచించారు. కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 15 వరకు పొడిగించినట్లు కలెక్టర్ తెలిపారు.



ఒంటరి మహిళల పెన్షన్ దరఖాస్తులకు సంబంధించి తహసీల్దార్, ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్ నిర్వహించే స్థానిక విచారణ నివేదికను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదన్నారు. వితంతు పెన్షన్ దరఖాస్తుదారులు మరణించిన భర్తకు సంబంధించిన మరణ ధ్రువీకరణ పత్రం, ఆధార్ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం తప్పనిసరి కాదని తెలిపారు. అదేవిధంగా దివ్యాంగుల పెన్షన్ దరఖాస్తుదారులు సదరం, యూడీఐడీ ధ్రువీకరణ పత్రాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదన్నారు. ఆన్‌లైన్‌లో కొత్తగా నమోదు చేసిన పెన్షన్ దరఖాస్తుల వివరాలను సాధారణ ప్రజలు తెలుసుకునేందుకు శోధన సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు అధికారులు తెలిపారు. గతంలో పెన్షన్ మంజూరై, కొంతకాలం అనంతరం వివిధ కారణాలతో నిలిపివేయబడి, ప్రస్తుతం క్రియాశీల పెన్షనర్‌గా లేని వారు కూడా కొత్త దరఖాస్తు ఫారం ద్వారా తమ వివరాలను తిరిగి నమోదు చేసుకోవచ్చని వెల్లడించారు. కల్లుగీత కార్మికుల పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే వారు ట్రీ ఫర్ ట్యాపర్ ధ్రువీకరణ పత్రం, గుర్తింపు కార్డును అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ ధ్రువీకరణ పత్రం వ్యక్తిగత కల్లుగీత కార్మికులకు, కల్లుగీత సహకార సంఘం సభ్యులకు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్, సీఐ ద్వారా జారీ చేయబడినదై ఉండాలని పేర్కొన్నారు. చేనేత కార్మికుల పెన్షన్‌కు దరఖాస్తు చేసుకునే వారు చేనేత శాఖ సహాయ సంచాలకులు ద్వారా జారీ చేయబడిన ధ్రువీకరణ పత్రం, గుర్తింపు కార్డును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. సంబంధిత పెన్షన్ కేటగిరీకి తప్పనిసరిగా అవసరమైన ధ్రువీకరణ పత్రాన్ని ఆన్‌లైన్ డేటా నమోదు సమయంలో అప్‌లోడ్ చేయలేకపోయినప్పటికీ, దరఖాస్తు ధ్రువీకరణ సమయంలో సంబంధిత ధ్రువీకరణ అధికారికి సమర్పించే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేశారు. అర్హులైన ప్రజలు సెప్టెంబరు 15లోపు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. మరిన్ని వివరాలు, సందేహాల నివృత్తి కోసం 9247524051 నంబర్‌ను సంప్రదించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, డీఆర్‌డీఏ అధికారులు సూచించారు.

## ఖైరతాబాద్ గణనాథుడిని ఘనంగా స్వాగతిద్దాం

**జూబ్లీహిల్స్, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:** ఖైరతాబాద్ బడా గణేష్ నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సమన్వ యంతో పనిచేయాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దానం నాగేందర్ సూచించారు. ఈ నెల 14 నుంచి 25 వరకు జరగనున్న ఉత్సవాల ఏర్పాట్లపై శనివారం స్థానిక మున్సిపల్ వార్డు కార్యాలయంలో సన్నా హక సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు దేశవ్యాప్తంగా భారీ సంఖ్యలో భక్తులు ఖైరతాబాద్ బడా గణేష్ ను దర్శించుకునే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ బందోబస్తు, బారికేడింగ్, నిరంతర విద్యుత్, తాగునీరు, పారిశుద్యం, ట్రాఫిక్ నియంత్రణ, రోడ్ల మరమ్మతులు, వీధి దీపాలు, విద్యుత్ భద్రత, కళా ప్రదర్శనలు తదితర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.



సిఎంను కలిసిన తాండూరు న్యాయవాదులు

## తాండూరులో సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు గ్రీన్‌సిగ్నల్

**పెద్దేముల్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** తాండూరులో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంగీకారం తెలిపారని తాండూరు న్యాయవాద సంఘం అధ్యక్షులు కురువ శ్రీనివాస్, ప్రభుత్వ న్యాయవాది మహేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శనివారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అధ్వర్యంలో కోడంగల్ లోని సిఎం కార్యాలయంలో ఆయనను కలిసి తాండూరులో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుకు విన్నవించారు. అందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఏ ప్రాంతంలో అయితే ఆర్డిఓ కార్యాలయం ఉంటుందో అక్కడ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఉండాలనే నిబంధనలు ఉన్నాయని అన్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో న్యాయవాదులు చంద్రశేఖర్‌రెడ్డి, మస్తాన్ తదితరులు ఉన్నారు.

## ఆచార్యదేవో భవ..

**ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి ఉపాధ్యాయులకు సత్కారం**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 5 ప్రభాతవార్త:** సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర మహాగొప్పదని, విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయులపైనే ఆధారపడి ఉంటుందని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు. శనివారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో 67 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సన్మానించారు. పుస్తకాలు జ్ఞానాన్ని ఇస్తే, దానిని ఎలా ఉపయోగించాలో నేర్పేది ఉపాధ్యాయులేనని కలెక్టర్ వ్యాఖ్యానించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు బోధనా ప్రణాళికలను రూపొందించుకోవాలని డిఇఓ రేణుకాదేవి సూచించారు.



షాద్‌నగర్‌లో గురువులకు పాదాభివందనం చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

**మేడ్చల్ :** మేడ్చల్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మేడ్చల్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో టీచర్స్ డే వేడుకలు నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ క్రాంతి కుమార్ ఉపాధ్యాయులను సన్మానించి, విద్యార్థులకు క్రమశిక్షణ, నైతిక విలువలతో పాటు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.

గురువులకు ఎమ్మెల్యే సత్కారం

**షాద్‌నగర్:** షాద్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గురువులు విజ్ఞానాన్ని నింపుకున్న కల్పతరులని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఉపాధ్యాయుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తుందని, వారు విద్యార్థుల భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని కోరారు. ఇదే క్రమంలో తనకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు

## హియరింగ్ ప్రక్రియ మరింత వేగవంతం

**కలెక్టర్ మనుచౌదరి ఆదేశం**

**ఓటర్ల నుంచి స్వీకరించిన ధృవపత్రాల పరిశీలన**

**శామీర్‌పేట, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** ఎస్ఐఆర్‌కు సంబంధించి ఓటర్లకు నోటీసులు జారీ చేశాక వారి నుంచి స్వీకరించిన ధృవపత్రాల పరిశీలన ప్రక్రియను హియరింగ్‌ను వేగవంతం చేయాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి సంబంధిత అధికారులను, బిఎల్ఓలను ఆదేశించారు. శనివారం శామీర్‌పేట మండలంలోని అంతాయిపల్లి, ఉప్పరిపల్లి గ్రామాలను జిల్లా కలెక్టర్ సందర్శించి ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియను ధృవపత్రాల పరిశీలనను ఆయన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగ కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-2026ను రెండవ విడతలో ఓటర్లకు నోటీసుల ఇచ్చిన తరువాత ఓటర్ల నుంచి అందిన ధృవపత్రాలను వెంటనే పరిశీలించి హియరింగ్ ప్రక్రియను కూడ వేగవంతం చేయాలన్నారు. ఈ క్రమంలో జిల్లాలో మ్యాపింగ్ జరగకుండ ఉన్న ఓటర్లు, ఓటరు కార్డులో ఉన్న వ్యత్యాసాల కేటగిరిలను ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఓటర్లు అందిస్తున్న ధృవపత్రాల విచారణ వేగవంతం చేయాలన్నారు. అర్హత గల ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో పేరు ఉండేలా చూడాలని అన్నారు. జాబితాలో గల ఓటర్లు తమ వివరాలను సమర్పించేలా రాజకీయ పార్టీల వారు బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా చర్యలు తీసుకోవాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా సమర్దవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కలెక్టర్ సూచించారు. కొత్తగా నమోదు చేసుకునే ఓటర్లు ఫారం-6, చిరునామా మార్పు కోసం ఫారం-7, మరణించిన, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలి పోయిన ఓటర్లు ఫారం-8 ఓటర్లకు అందజేసి అవగాహన కల్పిస్తూ ఈ ప్రక్రియను తొందరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ధృవపత్రాలను ధృవీకరించిన తరువాత సంబంధిత పత్రాలను అప్లోడ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, ఏఈఆర్ఓ (తూంకుంట) పి.మధుసూదన్‌రెడ్డి, బిఎల్ఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ఉప్పరిపల్లిలో ధృవపత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి



## సిఎం పర్యటన ప్రశాంతం పోలీస్ సిబ్బందికి ఇంచార్జి ఎస్‌పి అభినందనలు

**వికారాబాద్, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గ పర్యటన ప్రశాంతంగా ముగిసిందని, బందోబస్తు విధులు సమర్థవంతంగా నిర్వర్తించి పోలీస్ అధికారులకు, సిబ్బందికి జిల్లా ఇంచార్జి ఎస్పీ పరితోష్ పంకజ్, జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా అభినందనలు తెలిపారు. ఛార్మినార్ జోన్ డీఐజీ చందన దీప్తి ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీఎం పర్యటన ప్రశాంతంగా ముగిసిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించినట్లు వారు తెలిపారు. పర్యటనను విజయవంతంగా నిర్వహించడంలో ప్రతి ఒక్క అధికారి, సిబ్బంది సమన్వయంతో, క్రమశిక్షణతో, విధులు నిర్వర్తించారని, వారి సమిష్టి కృషి అభినందనీయమని పేర్కొన్నారు.



అవార్డు అందుకుంటున్న మాదాసి కురువ నరసింహం

## ఎస్‌సి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా నరసింహం

**పెద్దేముల్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన మాదాసి కురువ నరసింహం ఎస్‌సి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఈ మేరకు హైద్రాబాద్ రవింద్ర భారతిలో తెలంగాణ సాంస్కృతిక సౌజన్యంతో జరిగిన ప్రజా యుద్ద నౌక గద్దర్ నాటకం భాస్కర్‌ని సత్య జగదీష్ పుస్తక ఆవిష్కరలో భాగంగా బేబిరాజు, వెన్నెల, ప్రోపేసర్ డాక్టర్ ఖాసీం, పాశం యాదగిరి, దిబ్బన్నకంటి రంగన్న చేతుల మీదుగా మాదాసి కురువ నరసింహం మాదాసి కురువ ఎస్‌సి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా సర్టిపికేట్‌ను అందుకొని ఘనసన్మానం పొందారు. ఈ సందర్బంగా కురువ నరసింహం మాట్లాడుతూ సంఘ అభివృద్ది తనవంతు కృషిచేస్తానని అన్నారు. తన విజయానికి కారకులైన డి,రంగన్న, జేబి రాజు, మాదాసి కురువ ఎస్‌సి సంక్షేమ సంఘం పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



నూతన గృహ ప్రవేశంలో పాల్గొన్న నాయకులు

## పేదల సొంతింటి కలను సాకారం చేయడం కాంగ్రెస్‌కే సాధ్యం

**పెద్దేముల్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** పేదల సొంతింటి కలను సాకారం చేయడం కాంగ్రెస్‌కే సాధ్యమని ఆ పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యాక్షులు ఎన్. ఎల్లారెడ్డి అన్నారు. శనివారం పెద్దేముల్ మండల కేంద్రంలోని కుమ్మరి లక్ష్మి యాదయ్య ఇందిరమ్మ నూతన గృహప్రవేశ కార్యాక్రమానికి కాంగ్రెస్‌పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యాక్షులు ఎల్లారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీన్‌కుమార్ గుప్తా హజరయ్యారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ళ పథకం ద్వారా పేద, మధ్య తరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషిచేస్తామని అన్నారు. నూతన ఇందిరమ్మ ఇంటిలో సకాల శుభాలు కలిగి, కుటుంబ సభ్యులు పిల్లపాపలతో నిండు నూరెళ్ళు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామకమిటి అధ్యక్షులు సాయులు, నాయకులు షబ్బీర్, రాజు, నర్సి ములు, కోళ్ళ గోపాల్, తింసాన్‌పల్లి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉద్యోగ,ఉపాధ్యాయ, జెఎసి నాయకులు

## ఛలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10వ తేదీన ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందున పెద్ద ఎత్తున ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని మేడ్చల్ జిల్లా టిజిఈజెఎసి నాయకులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. దీనిలో అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి టిజిఈజెఎసి నాయకులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు అందరు పెద్ద ఎత్తున ఈ నెల 10వ తేదీన ఛలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అదే విధంగా జిల్లా కలెక్టరేట్ వద్ద టిఎన్‌జిఓస్ కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షులు కార్తీక్ ఆధ్వర్యంలో డిఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ కె.ఆనంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిజిఈజెఎస్ జిల్లా చైర్మన్ రవిప్రకాశ్, ప్రధాన కార్యదర్శి వినోద్, అదనపు కార్యదర్శి వై.రామేశ్వర్‌గౌడ్, కో-చైర్మన్ బి.వెంకటేశ్వర్లు, వైస్‌చైర్మన్లు ఆనంద్‌రెడ్డి, విఠల్, మదన్‌రెడ్డి, రాజు, భరత్‌కుమార్, శేషసాయి గిరికాంత్, కె.అశ్విని, కార్తీక్, అక్షయ్‌కుమార్, నాగరాజ్, అబ్రహం, ఉమాకాంత్, కిషోర్, శివ తదితరులు పాల్గొన్నారు.

## లోమూస్‌తో అనురాగ్ ఒప్పందం

**ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** అనురాగ్ యూనివర్సిటీలోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ విభాగంతో భారత శ్రీలంక యుకేలలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న లోమూస్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు యూనివర్శిటీ ఏఐ అండ్ ఎంఎల్ హెడ్ ఎ. మల్లిఖార్జున్‌రెడ్డి తెలిపారు. ఈ



ఒప్పందం ద్వారా విద్యార్థులకు ఇంటర్న్ షిప్‌లు, పరిశ్రమ ఆధారిత ప్రాజెక్టులు, సాంకేతిక శిక్షణ, పరిశోధనా సహకారం, గెస్ట్ లెక్చర్లు, ప్లేస్‌మెంటు అవకాశాలు వంటి అనేక ప్రయోజనాలు లభిస్తాయని తెలిపారు. అభివృద్ధి చెందుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతలపై విద్యార్థులకు పరిశ్రమ అనుభవంతో పాటు ప్రాయోగిక పరిజ్ఞానం అందించేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని అన్నారు. విద్య, పరిశోధన, సాంకేతిక ఆవిష్కరణలు, పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాల అభివృద్ధిలో ఈ భాగస్వామ్యం విజయవంతంగా కొనసాగాలని ఏయూ ఏఐ అండ్ ఎంఎల్ విభాగం అభిప్రాయపడింది. ఎంవోయు కార్యక్రమంలో ఎఐ అండ్ ఎంఎల్. హెడ్ ఎ. మల్లిఖార్జున్‌రెడ్డితో పాటు అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రవంత్‌కుమార్, లోమూస్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ చీఫ్ ఆపరేషన్స్ అధికారి వినోద్ కుమార్ కిల్లే సంతకాలు చేశారు.

## రాజకీయంగా ఎదుర్కోలేక కుయుక్తులు

**షాద్‌నగర్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** తన రాజకీయ ఎదుగుదల భారతీయ జనతా పార్టీ వీరోచిత పోరాటాలను చూసి ఓర్వజాలక తనపై తప్పుడు ప్రచారం కొందరు చేస్తున్నారని దీనిని కార్యకర్తలు ఎవరు విశ్వసించకూడదని షాద్ నగర్ భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఓ ప్రకటనలో వివరణ ఇచ్చారు. తనపై భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామ చంద్రారావుకు అందే బాబయ్య ఫిర్యాదు చేసినట్లు వచ్చిన సమాచారాల్లో వాస్తవం లేదన్నారు. సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ వ్యవహారంలో ఓవైపు పార్టీ నాయకులు అందే బాబయ్య, నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డిలు ఢిల్లీలో సైతం వీరుచిత పోరాటం చేశారని గుర్తు చేశారు. అదేవిధంగా డంపింగ్ యార్డ్ వ్యవహారాన్ని తాను కూడా తప్పుపడుతూ పెద్ద ఎత్తున ఉద్యమించాలని తెలిపారు. అలాగే పాలిటెక్నిక్ విలీన ఆందోళన కార్యక్రమంలో కూడా పాలుపంచుకోవడం జరిగిందని అనేక ప్రజా వ్యతిరేక ఉద్యమాలలో తాను ఉద్యమిస్తున్న సందర్భాలను గుర్తు చేశారు. ప్రజల్లో పార్టీ కార్యకర్తల్లో అపోహలు సూచించడానికి ఇదంతా చేస్తున్నారని దీనివల్ల బిజెపి పోరాటాలకు ఎలాంటి డోకా ఉండాలని మరింత ముందుకు వెళ్తానని చెప్పారు. ఏ భారతీయ జనతా పార్టీ కార్యకర్త పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి మీడియాకు సమాచారం ఇవ్వరని అని చెప్పారు.

# ఆచార్యదేవో భవ..

(మొదటి పేజీ తరువాయి)



మేడ్చల్ కలెక్టరేట్‌లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన గడ్డమీది బాల్‌రాజ్‌ను సత్కరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డిఇఓ రేణుకాదేవి, పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు



ధారూర్‌లో సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



మాద్గులలో ఉపాధ్యాయులను సత్కరించిన విద్యార్థులు

మదన్ మోహన్ రెడ్డి, గోపాలచార్యులను ఆయన శాలువాతో సన్మానించి పాదాభివందనం చేశారు.

**ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివి**

**కుల్కచర్ల :** విద్యారంగంలో ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాదరావు అన్నారు. కుల్కచర్ల మండల కేంద్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయులను ఆయన ఘనంగా సన్మానించారు. పేద విద్యార్థులకు సేవ చేసే అవకాశాన్ని ఉపాధ్యాయులు వినియోగించుకోవాలని, ఉపాధ్యాయులు వంద శాతం హాజరైతే విద్యార్థుల హాజరు కూడా పెరుగుతుందని పేర్కొన్నారు.

**పెద్దేముల్ :** నవసమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పెద్దేముల్ స్వామి వివేకానంద పాఠశాల ప్రిన్సిపాల్ జయంతి అన్నారు. పాఠశాలలో నిర్వహించిన గురుపూజోత్సవంలో ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ జయంతి, కరస్పాండెంట్ కె. కరుణాకర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చడంలో గురువుల పాత్ర ముఖ్యమైనదని, ఒక డాక్టర్ లేదా ఇంజనీర్‌ను తయారు చేయడం గురువుకే సాధ్యమవుతుందని చెప్పారు.

**ధారూర్:** ధారూర్ మండల విద్యావనరుల కేంద్రం ఆవరణలో పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సర్వేపల్లి విగ్రహానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయులు నివాళులర్పించారు. మండల శాఖ నాయకులు మాణిక్యం, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

**మాద్గుల:** మాద్గుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఘన సన్మానం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు సాధించిపెట్టిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వహకులు తెలిపారు. ఇదే సందర్బంగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు సాధించిన హెచ్ఎం సుదర్శన్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

**మోమిన్‌పేట్ :** మోమిన్‌పేట్ మండల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ దినోత్సవం వైభవంగా జరిగింది. బూర్గుపల్లిలో సర్పంచ్ పట్లోళ్ల వరప్రసాద్ రెడ్డి ఉపాధ్యాయులను సన్మానించి మెమొంటోలు అందజేశారు. జాతి నిర్మాణంలో గురువుల పాత్ర కీలకమని, గురువే లేకపోతే ఈ ప్రపంచమంతా గుడ్డిదేనని సర్పంచ్ వ్యాఖ్యానించారు.

**షాబాద్ :** షాబాద్ మండలం నుండి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులను ఎమ్మెల్యే మల్‌రెడ్డి వెంకట్ రెడ్డి, జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి, డిఇఓ వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించారని పీఆర్‌టీయూ మండల బాధ్యులు తెలిపారు. ఉపాధ్యాయులు మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచాలని కోరారు.

**ఘట్‌కేసర్ :** కొండాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఘట్కేసర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఆర్. దాసు, ఇతర ఉపాధ్యాయులను లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ రేసు లక్ష్మారెడ్డి శాలువాలు, పూలదండలతో సత్కరించారు.

ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్‌లో ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు-ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడి పాల్గొని పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాళ్లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అంతకు ముందు మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకిషన్ చిత్రపటానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. టీచర్లకు పూల మొక్కలను అందజేసి వారి సేవలను అభినందించారు. ఈకార్యక్రమంలో బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర కోఆర్డినేటర్ సభ్యుడు, పిఎంఈజిపి సెల్ కోకన్వీనర్ కప్పరగళ్ళ కరుణాకర్, నాయకులు ఏనుగు మచ్చేందర్‌రెడ్డి, ఉదారి కృష్ణ యాదవ్, కొలిచెలిమి సత్యనారాయణ, కాసుల వెంకటేష్‌గౌడ్, మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



కుల్కచర్లలో ఉపాధ్యాయులకు సత్కరించిన స్థానిక నాయకులు



పెద్దేముల్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, కరస్పాండెంట్



బూరుగుపల్లిలో ఉపాధ్యాయులను సన్మానించిన యువనాయకుడు సర్పంచ్ పట్లోళ్ల వరప్రసాద్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్వప్న



కొండాపూర్‌లో టీచర్లను సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ అధ్యక్షులు లక్ష్మారెడ్డి తదితరులు

**శామీర్‌పేట్ :** కొల్తూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను జీనోమ్ వ్యాలీ సీఐ గోపగాని గురువయ్య గౌడ్ ఘనంగా సన్మానించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవడంతో పాటు సైబర్ క్రైమ్, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కలిగి ఉండాలని సీఐ సూచించారు.



మేడ్చల్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులను సన్మానించిన ట్రాఫిక్ పోలీసులు



కొల్తూర్‌లో ఉపాధ్యాయులను సన్మానించిన జీనోమ్‌వ్యాలీ పోలీస్ ఇన్స్‌పెక్టర్ గోపగాని గురువయ్యగౌడ్



షాబాద్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

**ఉపాధ్యాయులకు విద్యార్థి సేన ఘన సన్మానం**

**షాద్‌నగర్:** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థి సేన షాద్‌నగర్ కమిటీ ఆధ్వర్యంలో పలు కళాశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవ కార్య క్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, వారి సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దుతూ, సమాజానికి ఉత్తమ పౌరులను అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని విద్యార్థి సేన అధ్యక్షులు టీకే శివప్రసాద్ అన్నారు. పలు కళాశాలల్లో ఉపాధ్యాయుల సన్మానం విద్యార్థి సేన షాద్ నగర్ కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు కళాశాలల్లో కార్యక్రమాలు నిర్వహించారు.




# కుల గణనతోనే సామాజిక న్యాయం

## షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** కులాల వారీగా ఖచ్చితమైన జనాభా, సామాజిక వెనుకబాటుతనం, ప్రభుత్వ రంగాల్లో ప్రాతినిధ్యంపై తాజా సమాచారం లేకుండా సామాజిక న్యాయం, సమానత్వం సాధ్యం కాదని ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ అన్నారు. కుల గణన నిర్వహించాలన్న డిమాండ్‌కు ఇదే ప్రధాన కారణమని పేర్కొన్నారు.శుక్రవారం గాంధీ భవన్‌లో కుల గణన అంశం పై నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు.కుల గణన లేకపోవడం వల్ల ఓబీసీల విషయంలో మండల్ కమిషన్ సైతం 1931 నాటి జనాభా గణాంకాలపై ఆధారపడాల్సి వచ్చిందని కొప్పుల రాజు గుర్తుచేశారు. ప్రస్తుత జనాభా, సామాజికఆర్థిక పరిస్థితులు, విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యంపై కులాల వారీగా తాజా సమాచారం ఉంటేనే ఆయా వర్గాలకు న్యాయమైన వాటా కల్పించేందుకు సమర్థవంతమైన విధానాలను రూపొందించగలమని అన్నారు. రాబోయే జనాభా గణనలో అన్ని జనరల్ కేటగిరీలతో పాటు కేటగిరీ, కులం వివరాలను నమోదు చేసేందుకు ప్రత్యేక ఆప్షన్లు చేర్చాలని కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోందని తెలిపారు. అట్టడుగు వర్గాలకు




మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

సంబంధించిన జాబితాలు ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద అందుబాటులో ఉన్నందున కులాల వారీ వివరాలను నమోదు చేయడం పెద్ద సమస్య కాదని పేర్కొన్నారు.జనాభా గణన ప్రక్రియ 2027 ఫిబ్రవరి నుంచి దేశవ్యాప్తంగా ప్రారంభం కానున్నందున ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కులాల వారీ వివరాలను జనాభా గణనలో చేర్చాలని డిమాండ్ చేశారు. హౌస్‌లిస్టింగ్ దశలో కుల సంబంధిత వివరాలను సేకరించలేదని, అయితే జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభానికి ఇంకా సమయం ఉన్నందున ఈ అంశాన్ని చేర్చేందుకు కేంద్రానికి అవకాశం ఉందన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

## అభివృద్ధిని చూసి ఓర్వలేకే బిఆర్ఎస్ రాద్దాంతం

**షాద్‌నగర్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** షాద్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి బీఆర్ఎస్ నాయకులు బెంబేలెత్తిపోతున్నారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శనివారం ఏర్పాటుచేసిన ఓ సమావేశంలో మున్సిపల్ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నేత అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, కౌన్సిలర్లు కొప్పునూరి ప్రవీణ్, మురళీమోహన్, అప్పి, కళ్యాణ్‌కార్ దిలీప్, పెంటయ్య, సీనియర్ నాయకులు ముబారక్ అలీ ఖాన్, సయ్యద్ ఖదీర్, గంగ తదితరులు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గానికి కీలకమైన లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ కోసం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రభుత్వపరంగా అన్ని అనుమతులు సాధించడంతో పాటు నోటిఫికేషన్ కూడా విడుదల చేయించారని తెలిపారు. దీంతో దిక్కుతోచని పరిస్థితిలో ప్రతిపక్ష నాయకులు రోడ్లపై పడి గగ్గోలు పెడుతున్నారని విమర్శించారు. కేసీఆర్‌ను రాజకీయంగా బతికించుకునేందుకే నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు తాపత్రయ పడుతున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించలేరన్నారు.




ర్యాలీలో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు

## సిఎంది సొంత జిల్లాకు సాగునీరు ఇవ్వలేని దుస్థితి

**షాద్‌నగర్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో అన్ని రంగాల్లో విఫలమైందని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్‌ను విమర్శించడంపైనే సీఎం రేవంత్ రెడ్డి దృష్టి పెట్టారని, రాష్ట్ర పాలనపై మాత్రం సరైన శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలన తీరును నిరసిస్తూ షాద్ నగర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్బంగా అంజయ్య యాదవ్ మాట్లాడారు. అధికారంలోకి రాకముందు ప్రజలకు ఇచ్చిన 420 హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిపోయిందని అంజయ్య యాదవ్ విమర్శించారు. పేరుకే ప్రజా పాలన అని చెబుతున్నప్పటికీ, ప్రజల సమస్యలను పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. సొంత జిల్లాకు సాగునీరు అందించలేని పరిస్థితిలో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు గత ప్రభుత్వ పాలనను గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థులు, యువత భారీ సంఖ్యలో ర్యాలీ నిర్వహించారు. చౌరస్తాలో నిరసన చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, రవీందర్ యాదవ్, మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబల్ నాయక్‌తో పాటు మాజీ మార్కెట్ చైర్మన్లు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, మాజీ పీఏసీఎస్ చైర్మన్లు, మాజీ గ్రంథాలయ చైర్మన్లు, మాజీ వైస్ చైర్మన్లు, మాజీ వైస్ ఎంపీపీలు, బీఆర్ఎస్ మండల, గ్రామ, మున్సిపాలిటీ, వార్డు అధ్యక్షులు, ప్రస్తుత మరియు మాజీ సర్పంచులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ యువత, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

### నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ ఆదేశం

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** రాబోయే వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జన వేడుకలను నగరంలో అత్యంత శాంతియుత వాతావరణంలో, వైభవంగా నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ ఆదేశించారు. గణేష్ ఉత్సవాల బందోబస్తు ఏర్పా ట్లపై శనివారం బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీ ఆడిటోరియంలో పోలీస్ అధికారులతో ఆయన సన్నాహక సమావేశంలో సజ్జనార్ మాట్లాడుతూ పదకొండు రోజుల పాటు జరిగే గణేష్ ఉత్సవాల ను అత్యంత సీరియస్‌గా తీసుకుని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బం దీ బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని గణేష్ మండపాల నిర్వాహకులు హైదరాబాద్ సిటీ పోలీస్ రూపొం దించిన యాప్ విధిగా దరఖాస్తు చేసుకోవాలన్నా రు. ఆ వివరాలను నిర్దేశిత యాప్‌లో తప్పని సరిగా జియోట్యాగింగ్ చేయాలన్నారు. రద్దీ ఎక్కు వగా ఉండే మండపాల వద్ద బారికేడ్లు, క్యూలైన్లు, భద్రత దృష్ట్యా సీసీటీవీ కెమెరాల ఏర్పాటును నిర్వాహకులు చేపట్టేలా ప్రోత్సహించాలన్నారు. స్థానికంగా ఇబ్బందులు తలెత్తకుండా సెక్టార్ అధి కారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని వివ రించారు. శంషాబాద్, రాజేంద్రనగర్ జోన్‌లను హైదరాబాద్ సిటీలో కలపడం వల్ల బాలాపూర్ నుండి ఖైరతాబాద్ వరకు ఉత్సవాలు నగర పోలీస్ పరిధిలోకి వచ్చాయని తెలిపారు. బాలా పూర్ నుంచి ప్రారంభమై ప్రధాన నిమజ్జన మార్గా ల గుండా ట్యాంక్‌బండ్, ఇతర జలాశయాల వరకు వెళ్లే మార్గాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, భారీ విగ్రహాల తరలింపులో ఎలాంటి ట్రాఫిక్ జా మ్‌లు రాకుండా, ఎత్తు ఎక్కువగా ఉన్న విగ్రహాల వల్ల విద్యుత్ తీగలు తగలకుండా ముందస్తుగానే రూట్ క్లియరెన్స్ పూర్తి చేసుకోవాలన్నారు. సైబ రాబాద్, రాచకొండ సరిహద్దుల నుంచి వచ్చే విగ్రహాల రాకపోకలపై ఆయా కమిషనరేట్లతో సమన్వ యం చేసుకోవాలని, ఖైరతాబాద్ బడా గణేష్ వంటి భారీ రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ ప్రణాళికలను అమలు చేయాలని చెప్పా రు. పండుగ వేళ సమాజంలో విద్వేషాలు, ఉద్రిక్త తలు రెచ్చగొట్టేలా సామాజిక మాధ్యమాల్లో వచ్చే పోస్టులు, వదంతులపై ఐటీ సెల్, స్థానిక పోలీ సులు 24 గంటలు పర్యవేక్షి స్తాయని.. శాంతిభద్ర తలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించే వారిపై, రెచ్చగొట్టే కంటెంట్ వ్యాప్తి చేసే వారిపై చట్టపరం గా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించా రు.రాబోయే నెల రోజులు ఎంతో కీలకమని అధి కారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రజలకు నిరంత రం అందుబాటులో ఉంటూ విజిబుల్ పోలీసింగ్ అ మలు చేయాలన్నారు. విధుల్లో ఉండే సిబ్బంది ప్రజ లు,భక్తులతో ఎంతో సంయమనం, ఓర్పుతో వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో ఎం. శ్రీనివా స్,(అడిషనల్ సీపీ, క్రైమ్స్ సిట్), తఫ్సీర్ ఇక్బాల్, (అడిషనల్ సీపీ,లాఆర్డర్), విజయ్‌కుమార్,(జా యింట్ సీపీ, స్పెషల్ బ్రాంచ్), వివిధ జోన్ల డీసీపీలు, ట్రాఫిక్ డీసీపీలు పాల్గొన్నారు.

## జూపార్కులో ఆకట్టుకుంటున్న తెల్ల పులి

**చార్మినార్,సెప్టెంబరు 5 ప్రభాతవార్త :** జూపార్కులోని ఎన్‌క్లోజర్ వద్ద ఉన్న తెల్ల పులి సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నది. హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులో తొమ్మిది రాయల్ పులులు,12 తెల్ల పులులు ఉన్నాయి.కాగా ఒకటిన్నర సంవత్సరాలు వయ స్సు గల తెల్ల పులి (యశోద) ఎన్‌క్లోజర్ ప్రాం తంలో తిరుగుతూ కనిపించింది.అదే సమయంలో తెల్లపులిని సందర్శకులు ఆసక్తితో తిలకించారు.

## శంషాబాద్‌లో రోడ్డు ప్రమాదం .. యువతి మృతి

**శంషాబాద్ సెప్టెంబరు5,ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలై మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.సిఐ సంజీవ్ వివరాల ప్రకారం..శంషాబాద్ ఎయిర్‌పోర్టు అప్రోచ్ రోడ్డులోని ఆర్‌ఓబీ యూటర్న్ సమీపంలో శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుందని ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిళ తీవ్ర గాయాలతో మృతి చెందిందని తెలిపారు.ఉదయం 6:43 గంటల సమయంలో పుల్లమోని రాధిక (33) బైక్ నంబర్ టిఎస్07హెచ్ఎక్స్0918పై వెనుక కూర్చొని ప్రయాణిస్తోంది. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు టిజి0ఎక్స్8636 బైక్‌ను ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు.ప్రమాదంలో రాధిక తల, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా వాహనం నడిపినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు.

## చౌకధరదుకాణం డీలర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**శంషాబాద్, సెప్టెంబరు5,ప్రభాతవార్త :** శంషాబాద్ మండలం పిల్లోనిగూడలో ఖాళీ ఉన్న చౌక ధర దుకాణం డీలర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాజేంద్రనగర్ ఆర్డీవో కార్యాలయం ప్రకటించింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. పిల్లోనిగూడలోని చౌక ధర దుకాణానికి సంబంధించిన ఖాళీ పోస్టును భర్తీ చేయనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.అభ్యర్థులు అవసరమైన ధ్రువపత్రాలతో సెప్టెంబర్ 15 సాయంత్రం 5 గంటల్లోగా రాజేంద్రనగర్ డివిజన్ ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని అధికారులు తెలిపారు. గడువు అనంతరం వచ్చిన దరఖాస్తులను స్వీకరించబోమని స్పష్టం చేశారు.

## ఎస్ఐఆర్ నోటీసులపై అపోహలు వద్దు

**-సరైన ధ్రువపత్రాలు సమర్పించి ఓటు హక్కు పొందవచ్చు**
**-శంషాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు**


సాతంరాయిలో ఓటర్ల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్న డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు

**శంషాబాద్, సెప్టెంబరు5,ప్రభాతవార్త :** ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా జారీ చేస్తున్న నోటీసులను ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకుండా సరైన ధ్రువపత్రాలను అందించి ఓటర్‌గా నమోదు చేయించుకోవాలని శంషాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు పేర్కొన్నారు.శనివారం శంషాబాద్ సర్కిల్ పరిధిలోని సాతంరాయిలో ప్రభుత్వం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓటర్ నమోదు కేంద్రాల్లో స్వయంగా డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు ఓటర్ల నుండి దరఖాస్తులు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఓటర్ల జాబితాలో ప్రతి అర్హుడి పేరు ఉండేలా, అనర్హుల పేర్లు తొలగించేలా ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నామని 12వేల నోటిసుల్లో ఇప్పటి వరకు 6వేల నోటీసులు అందించడం జరిగిందని వారు సూచించిన గడువులోగా సంబంధిత పత్రాలతో తమ అభ్యంతరాలు, వివరణలను అధికారులకు సమర్పించాలని సూచించారు.అనవసరంగా భయపడాల్సిన అవసరం లేదని అర్హత కలిగిన ప్రతి ఓటరుకు తన వివరాలను ధృవీకరించుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. ప్రజలు అధికారులు అడిగే వివరాలను సమర్పించి ప్రక్రియకు సహకరించాలని ఎస్ఐఆర్ ప్రక్రియపై తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నాలను నమ్మవద్దు. ప్రజల సందేహాలను నివృత్తి చేసేందుకు అధికారులు అందుబాటులో ఉంటారని ఓటర్ల జాబితా స్వచ్ఛంగా, పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో బిఎల్ఓలు పాల్గొన్నారు.

## ఘనంగ హనుమాన్ చాలీసాపారాయణం

**జిల్లేడు చౌదరిగూడెం, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలో శనివారం హనుమాన్ చాలీసాపారాయణ కార్యక్రమాలను ఘనంగ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలు పలువురు వక్తలు జాతినుద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజలు, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అరిస్టాటిల్ కళాశాలలో ఘనంగా ఓరియంటేషన్ డే

**మొయినాబాద్, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :** మారుతున్న పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అభివృద్ధి చేసుకోవాలని జేఎన్టీయూ మాజీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ కె. నరసింహారెడ్డి సూచించారు. పోటీ ప్రపంచంలో రాణించేందుకు విద్యతో పాటు ఆత్మవిశ్వాసం, కమ్యూనికేషన్ నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు, వృత్తిపరమైన దృక్పథం ఎంతో ముఖ్యమని అన్నారు.మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు రెవెన్యూ పరిధిలో గల అరిస్టాటిల్ పీజీ కళాశాలలో శనివారం ఎంబీఏ ఓరియంటేషన్ డే వేడుకలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్. శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా




నిర్వహించారు. నూతనంగా ఎంబీఏలో చేరిన విద్యార్థులకు స్వాగతం పలికి, ఉన్నత విద్యా ప్రమాణాలు, భవిష్యత్ కెరీర్‌పై మార్గనిర్దేశం చేశారు.

**నైపుణ్యాలతోనే పోటీ ప్రపంచంలో రాణింపు**

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జేఎన్టీయూ మాజీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ కె. నరసింహారెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపల్ లయన్ ఎం. నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులు అలవర్చుకోవడంతో పాటు నిరంతరం సాధన, అనుభవం ద్వారా తమను తాము తీర్చిదిద్దుకోవాలని సూచించారు.కమ్యూనికేషన్ నైపుణ్యం, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలతో పాటు వృత్తిపరమైన దృఢ సంకల్పాన్ని అలవర్చుకుంటే విద్యార్థులు తమ కెరీర్‌లో ఉన్నత స్థాయికి చేరుకోగలరన్నారు. కళాశాలలో లభించే విద్యా ప్రమాణాలు, అవకాశాలను సమర్థవంతంగా వినియోగించుకుని భవిష్యత్‌కు బలమైన పునాది వేసుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు.కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఎంబీఏ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**నిత్యం కేసీఆర్‌ను తిట్టడమే తప్పు.. పాలనపై సీఎం రేవంత్‌కు ధ్యాస లేదు**
**బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకటరెడ్డి**

**మొయినాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** నిత్యం కేసీఆర్‌ను తిట్టడమే తప్పు.. పాలనపై సీఎం రేవంత్‌కు ధ్యాస లేదని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకటరెడ్డి అన్నారు. టిఆర్ఎస్ ఆధ్వర్యంలో మొయినాబాద్ లో భారీ ఆందోళన చేపట్టారు ఈ సందర్భంగా దారెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీల ఊసే లేదన్నారు. కెసిఆర్ పాలనలో సకలజనులకు సంక్షేమ పథకాలు అందితే నేడు సకలజనులు అష్ట కష్టాలు పడుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తేశాడు.. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారని, నిరుద్యోగులకు ఇచ్చిన మాటను తప్పి, నోటిఫికేషన్లను మర్చిపోయారన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కొంపల్లి అనంతరెడ్డి కొత్త నరసింహారెడ్డి సురంగల్ కౌన్సిలర్ కర్రోల్ల శ్రీధర్ మాజీ సర్పంచులు నరోత్తం రెడ్డి సుధాకర్ యాదవ్ రాఘవరెడ్డి కుమార్ మాజీ ఎంపీటీసీ మొర శ్రీను మాజీ ఉపసర్పంచ్లు షాబాద్ శ్యామ్ ముంచగల రాజు పిఎస్ సిఎస్సి మాజీ చైర్మన్ పార్టీ జగన్మోహన్ రెడ్డి సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ దప్పు రాజు పార్టీ ప్రసాద్ రెడ్డి షాబాద్ ప్రవీణ్ ఎల్కగూడెం ప్రభాకర్ పరమేష్ ఎలుకగూడెం రమేష్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పానకాల లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో సత్యనారాయణ స్వామి వ్రతం


స్వామివారి వ్రతంలో పాల్గొన్న చొప్పరి నరేందర్ లాస్యశ్రీ దంపతులు,

**కేశంపేట, సెప్టెంబరు 5 ,ప్రభాతవార్త :** శ్రావణమాసం ఆఖరి శనివారం సందర్భంగా కేశంపేట మండల పరిధిలోని సంతాపూర్, కోనాయి పల్లి గ్రామల పరిధిలోల అరణ్య ప్రాంతంలో కొలువుదీరిన పానకాల లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో శనివారం కొనయిపల్లి గ్రామానికి చెందిన చొప్పరి నరేందర్ లాస్యశ్రీ దంపతులు భక్తిశ్రద్ధలతో సత్య నారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, వ్రత కార్యక్రమాన్ని నిర్వహించి స్వామివారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. వ్రతంలో కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం వచ్చిన భక్తులకు చొప్పరి నరేందర్ లాస్య శ్రీ దంపతులు అన్న వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ చొప్పరి ధనలక్ష్మి రామకృష్ణ, మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కోనాయిపల్లి ఉపసర్పంచ్ హనుమంతు నాయక్, రాము, శ్రీకాంత్,అజయ్, సంతోష్ రెడ్డి, మహేష్, నరసింహ, రాకేష్, గ్రామ పెద్దలు మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు. శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా స్వామివారి సన్నిధిలో ఎక్కడ చూసిన ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# క్రీడా పోటీలతో యువతలో ఉత్సాహం

**..మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి**
**..అలియాబాద్‌లో మాజీ సర్పంచు దివంగత బండి రాఘువరెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా విగ్రహం వద్ద నివాళులు**
**..క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల ప్రధానం చేసిన వైనం**

**శామీర్‌పేట, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** క్రీడా పోటీల నిర్వాహణతో యువతలో ఉత్సాహం పెరుగుతుందని, క్రికెట్ పోటీలను నిర్వహించి యువతను ప్రోత్సహించటం అభినందనీయమని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి అన్నారు. శనివారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్‌లో మాజీ సర్పంచు దివంగత బండి రాఘువరెడ్డి 15వ వర్ధంతిని పురస్కరించుకుని విగ్రహం వద్ద పలువురు నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు. ఆ తరువాత మాజీ సర్పంచు బండి రాఘువరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని బిఆర్ఎస్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఫౌండర్ బండి రాంరెడ్డి,శేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో అలియాబాద్ మున్సిపల్ కేంద్రంలోని సిర్వి గ్రౌండ్‌లో యువతకు వారు క్రికెట్ పోటీలను నిర్వహించారు. 18టీమ్‌లు ఈ క్రికెట్ పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో విన్నర్ టీమ్‌గా అలియాబాద్ జై హనుమాన్ గుడ్‌విల్ టీమ్, రన్నర్‌గా తుర్కపల్లి బుల్స్ టీమ్ నిలిచినట్లు తెలిపారు. విన్నర్ టీమ్‌కు రూ.25వేలు, రన్నర్ టీమ్‌కు రూ.12వేల500 నగదు బహుమతితో పాటు ట్రోఫీని, కప్‌లను మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి విజేతలకు



అలియాబాద్‌లో క్రికెట్ పోటీల్లో విన్నర్ టీమ్‌కు నగదు బహుమతితో పాటు ట్రోఫీని అందజేసిన మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి,పాల్గొన్న ట్రస్ట్ నిర్వాహకులు బండి రాంరెడ్డి, పలువురు కౌన్సిలర్లు, నాయకుల దృశ్యం

అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ యువతలో స్నేహం పెరగాలంటే క్రీడా పోటీలు నిర్వహించాలన్నారు. మాజీ సర్పంచు బండి రాఘువరెడ్డి సర్పంచుగా అభివృద్ధి చేసి గ్రామానికి గుర్తింపును తెచ్చారని అన్నారు. ఆయన ఆశయ సాధనకు యువత పనిచేయాలని మల్లారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఫౌండర్ బండి రాంరెడ్డి, కౌన్సిలర్లు గుర్క కుమార్‌యాదవ్, యూసుఫ్‌బాబ, నాయకులు వంగ వెంకట్‌రెడ్డి, సాయిబాబ, శ్రీనివాస్‌రెడ్డి, శ్యామ్, మధుసూదన్‌రెడ్డి, శ్రీకాంత రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గూదె ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పట్టాదారులు

## మాపట్టా భూమికి ఇబ్బందులు కలిగిస్తున్నారు

**లేని అభియోగాలు మోపుతూ ఇబ్బందులు పెడుతున్నారని తహసీల్దార్‌కు వినతి**

**షాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** తమ సొంత పట్టా భూమిని చదును చేసుకుంటుంటే, కొందరు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పట్టాదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం షాబాద్ తహసీల్దార్ అన్వర్ కు వినతిపత్రం అందజేశారు. పట్టాదారులు మీడియాతో మాట్లాడుతూ..తమ పూర్వీకుల నుంచి వచ్చిన భూమిని సాగు చేసుకుంటున్నామని తెలిపారు. షాబాద్ మండలం కక్కులూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 428లో 12.14 గుంటలు, 429లో 2.13 గుంటల పట్టా భూమి ఉందని తెలిపారు. ఈ భూమిలోకి కొందరు అక్రమంగా చొరబడి దేవాదాయ భూమి అంటూ ఆరో పణలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.తమ పట్టా భూమికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడడంతో పాటు, తమకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని చేవెళ్ల ఆర్డిఓ, షాబాద్ తహసిల్దార్ కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమ భూమి హక్కులకు భంగం కలగకుండా అధికారులు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పట్టాదారులు శేఖరయ్యా, వీరేశం, చంద్రకళ, సులోచన, పున్నయ్య, సాంబయ్య, సుజాత, తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న సబితా ఇంద్రారెడ్డి

## ప్యూచర్ సిటిపై ఉన్న ప్రేమ నిరుద్యోగుల మీద లేదు

**షాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తి చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి వెయ్యి రోజులు పూర్తియిన కనీసం లక్ష ఉద్యోగాలు కూడా భర్తి చేయలేదని మాజీ హోంమంత్రి పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు శనివారం షాబాద్ మండల కేంద్రంలో స్టార్ గార్డెన్లో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్రెడ్డి ఆధ్వర్యంలో నాగర్గూడ నుండి షాబాద్లోని బహిరంగ సమావేశం వరకు 500 బైక్లతో భారీ ర్యాలీలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఐపీఎస్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, విజయ్ ఆర్య తదితరులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు, 18 డిక్లరేషన్లు, 420 హామీలు, ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. వంద రోజుల్లో నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామి ఇచ్చి, వెయ్యి రోజులు పూర్తయినా లక్ష ఉద్యోగాలు కూడా పూర్తి చేయలేదన్నారు. ముఖ్యమంత్రి మనసంతా ప్యూచర్ సిటీ భూముల చుట్టే తిరుగుతుందని, కందుకూరు, మహేశ్వరం, మొయినాబాద్, చేవెళ్ల, ఇప్పుడు షాబాద్ వైపు మల్లిందన్నారు. యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి రాష్ట్రంలో హత్యలు పెరిగి క్రైం రేటు పెరిగిందన్నారు. రైతులకు రూ.2 లక్షలలోపు రుణమాఫీ చేస్తామని సగం మందికే ఇచ్చారని అన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ ఇవ్వక ఉన్నత చదువులు చదువలేక పోతున్నారని అన్నారు.అనంతరం గిఫ్ట్ ఏ స్మైల్ కింది యువతకు క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. ఇటీవలై జరిగిన హత్యల కుటుంబ సభ్యులకు రూ. 6 లక్షల రూపాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నర్సింగ్రావు, పీఏసీఎస్ చైర్మన్ శేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు దేశమోళ్ల అంజనేయులు, ప్రభాకర్ రెడ్డి, నర్సింహారెడ్డి, రాజేందర్ రెడ్డి, మల్లారెడ్డి, పాండు, ఇమాన్, శ్రీనివాస్ గౌడ్, మధుకర్ రెడ్డి, రాంచంద్రారెడ్డి, అశోక్ గౌడ్, గణేష్ గౌడ్, ముక్రామ్, సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, నర్సింహులు, శ్రీశైలం, మల్లయ్య, కుమార్, సుధాకర్ రెడ్డి మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెడ్ల నిరసన దీక్ష పోస్టర్ ఆవిష్కరణ


శివారెడ్డిగూడలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని రెడ్డి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన తలపెట్టిన ధర్నాకు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఘట్‌కేసర్ రెడ్డి సంఘం అధ్యక్షులు చందుపట్ల వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఘట్ కేసర్ డివిజన్ శివారెడ్డిగూడలోని శ్రీప్రసన్నవీరాంజనేయస్వామి దేవాలయ ఆవరణలో శనివారం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం హైదరాబాద్ ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో జరిగే రెడ్ల నిరసన కార్యక్రమానికి ప్రతి ఇంటి నుండి ఒకరు చొప్పున తప్పకుండా హాజరై మన డిమాండ్ల సాధన కొరకు తమ వంతు బాధ్యతగా పాల్గొని మన తెలంగాణ రాష్ట్ర పలు రెడ్డి సంఘాలు చేపడుతున్న కార్యక్రమాలకు మద్దతుగా డిమాండ్లను నెరవేర్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఈనిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వెయ్యికోట్లతో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు రైతుభీమాను కొనసాగించాలని, రెడ్డి హాస్టల్‌కు బుద్వేల్‌లో కేటాయించిన 15 ఎకరాల భూమిలో రెడ్డి బంధువులకు ఇవ్వాలని, ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు ప్రభుత్వం అన్ని విభాగాలలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఘట్‌కేసర్ రెడ్డి సంఘం అధ్యక్షులు చందుపట్ల వెంకట్ రెడ్డి, సలహాదారులు సింగిరెడ్డి రామిరెడ్డి, మాజీ అధ్యక్షులు కొంత రామిరెడ్డి, సంఘం కోశాధికారి పాటి మహిపాల్‌రెడ్డి, కార్యవర్గసభ్యులు గడీల రామచంద్రారెడ్డి, చందుపట్ల లక్ష్మారెడ్డి, రాష్ట్ర నాయకులు పైళ్ల హరినాథ్‌రెడ్డి, తుమ్మల మధుకర్‌రెడ్డి, సంఘం సభ్యులు కొంతం అంజిరెడ్డి, గడీల సంజీవరెడ్డి, గడీల ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రాజ్యసభసభ్యులు లక్ష్మన్‌ను కలిసిన దాసు, నర్సింగ్‌రావు

## ఎస్సీ రైతుల భూములను 22ఏ నుంచి తొలగించాలి

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** భూ భారతి చట్టం ప్రకారం గత 70 సంవత్సరాలుగా భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రైతులకు న్యాయం చేయాలని కోరుతూ శనివారం అంబేద్కర్ సంఘం నాయకులు రాజ్యసభ సభ్యులు కోవ లక్ష్మణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రైతుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం వారికి హక్కులు కల్పించాలని వారు కోరారు.

దీర్ఘకాలంగా సాగులో ఉన్న భూములకు సంబంధించి రైతులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీ వర్గాలకు చెందిన రైతులు సాగు చేసుకుంటున్న భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి, వారికి భూమిపై పూర్తి హక్కులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏళ్ల తరబడి భూములను సాగు చేసుకుంటున్నప్పటికీ వివిధ కారణాల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. రైతులు, ఎస్సీ వర్గాల భూ సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి సమస్యను తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేయాలని వారు కోరారు. అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మేకల దాసు, మాజీ ఎంపిటిసి సభ్యులు మేకల నర్సింగ్ రావు తదితరులు ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు.




## ధర్నాకు తరలివెళ్లిన బిజెపి నాయకులు

**మేడ్చల్, సెప్టెంబరు 5. ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం 22 ఏ నిషేధిత జాబితాలో అక్రమంగా చేర్చి భూములను వెంటనే నిషేధిత జాబితాలో నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బిజెపి ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాకు మేడ్చల్ బీజేపీ నాయకులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ బీజేపీ ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షురాలు శైలజా హరినాథ్, ఎల్లంపేట మున్సిపల్ అధ్యక్షుడు శ్రీశైలం, నాయకులు సత్యనారాయణరెడ్డి, మహేష్, బాబురాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలిక ఆత్మహత్య

**మేడ్చల్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** ఓ బాలిక ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ మండలంలోని సైదోనిగడ్డ తండాకు చెందిన ఓ మైనర్ బాలిక పుట్టిన రోజు వేడుకలు గురువారం కుటుంబ సభ్యులు, బంధువుల మధ్య జరుగాయి. శుక్రవారం సాయంత్రం ఆమె తల్లిదండ్రులు స్థానిక ఆలయానికి వెళ్లగా బాలిక ఇంట్లోనె ఉన్నది. తల్లిదండ్రుల రాత్రి 10 గంటలకు ఇంటికి రాగా ఇంటి తలుపులు లోపలి నుండి గడియ పెట్టి ఉన్నాయి. ఎంత పిలిచినా ఆమె పలుకకపోవడంతో కిటికిలో నుండి ఇంటి లోపలికి చూడగా గదిలో ఆ బాలిక ఉరి వేసుకుని వేలాడుతూ ఉన్నది. వెంటనే తలుపులు పగులగొట్టి ఆమెకు కిందకు దింపి చూడగా అప్పటికే మృతి చెందింది. మైనర్ బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడంతో తండాలో విషాదచాయలు నెలకొన్నాయి. కాగా తండాకు చెందిన ఓ మైనర్ బాలుడి వేధింపులతోనే తన కూతురు ఆత్మహత్యకు పాల్పడిందని బాలిక కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

**రంగారెడ్డి అర్బన్ , సెప్టెంబరు 5, ప్రభాతవార్త :**మహిళా శిశు సంక్షేమ శాఖలో అంగన్‌వాడీ టీచర్ నియామకానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి శాంతిశ్రీ సూచించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దరఖాస్తుల సమర్పణకు ఈ నెల 10వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు.అయితే జిల్లాలోని కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు ఇప్పటివరకు తగిన సంఖ్యలో దరఖాస్తులు అందలేదని పేర్కొన్నారు. ఆయా కేంద్రాలకు సంబంధించి స్థానికంగా అర్హత కలిగిన అభ్యర్థులు తమ వెబ్‌సైట్‌లో వివరాలను పరిశీలించి, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈ నియామక ప్రక్రియలో మొదటి ప్రాధాన్యంగా స్థానిక అర్హతకు అవకాశం ఉంటుందని, అభ్యర్థులు ఎటువంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఎటువంటి మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఇంటర్12వ తరగతి ఉత్తీర్ణులైన మహిళలు70మార్కులు, వితంతువులు అదనంగా 5మార్కులు అనాథలు (జువెనైల్ జస్టిస్ చట్టం, 2015 ప్రకారం) మరో 10మార్కులు వికలాంగులు చట్టం, 2016 ప్రకారం) 5మార్కులు, సెలక్షన్ కమిటీ ద్వారా ఇంటర్వ్యూ 10మొత్తం100 మార్కులు ఉంటాయని తెలిపారు.ఒకే ప్రాజెక్టుకు ఒకే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని, ఆసక్తి ఉన్న అర్హులైన అభ్యర్థులు ఈ నెల 10వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా సంక్షేమ అధికారి శాంతి శ్రీ కోరారు.

## ఎంబిబిఎస్ సీట్ సాధించిన దళిత విద్యార్థిని హర్షిత

**తలకొండపల్లి సెప్టెంబరు 5,ప్రభాతవార్త:**



తలకొండపల్లి గ్రామానికి చెందిన దళిత విద్యార్థిని పెరుమాండ్ల రాజేందర్ జ్యోతి దంపతుల కూతురు పెరుమాండ్ల హర్షిత నీట్ పరీక్షల లో ఉత్తమ ఫలితాలు సాధించి ఎంబిబిఎస్ సీటును పొందారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన పెరుమాండ్ల హర్షిత 6వ క్లాస్ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇబ్రహీంపట్నంలోని మహాత్మ జ్యోతిరావు పూలే ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో చదివారు. ఇంటర్మీడియట్ అనంతరం నీట్ పరీక్షలో 4005 మార్కులు సాధించి ఎంబిబిఎస్ సీట్ పొందారు. రంగారెడ్డి జిల్లాలోని మొయినాబాద్ లో గల భాస్కర మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీటు పొందినట్లు తల్లిదండ్రులు రాజేందర్ జ్యోతులు తెలిపారు. దళిత వర్గానికి చెందిన తమ కుటుంబం అంబేద్కర్ చూపిన దారిలో నడిచి నా కూతురు సీటు పొందడం ఆనందం కలిగించిందని ఈ సందర్భంగా వారు తెలిపారు.

## కేటీఆర్‌ను కలిసిన గోలి శ్రీనివాస్ రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి

**తలకొండపల్లి సెప్టెంబరు5,ప్రభాతవార్త :** బి ఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీ రామారావును శుక్రవారం నాడు



రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి, టిఆర్ఎస్ తలకొండపల్లి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి లు కలిశారు. హైదరాబాదులోని తెలంగాణ ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తో కలిసి చంద్రశేఖర్ రెడ్డి తెలంగాణ భవన్లో మర్యాదపూర్వకంగా కలిశారు. సందర్భంగా కేటీఆర్ ను సన్మానించి సందర్భంగా కేటీఆర్ ను సన్మానించి సాల్ బోకేతో బొకేతో హవానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఈ సందర్భంగా వారికి సూచన చేశారు.

వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME
★ I, SUKKAMETI RADHAMMA (new name) W/o. Satyanarayana reddy R/o. 3-67, V: Kalakonda M: Madhu D: KV Rangareddy, T.G - 509360 Have Changed My Name From SUKKAMETI RADHA (old name) to SUKKAMETI RADHAMMA (new name) for all Purposes.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.



సమావేశంలో కాంగ్రెస్ నాయకులు

## అభివృద్ధిని చూసిఓర్వలేక
## స్పీకర్‌పై అనుచితవాక్యలు చేయడం సరికాదు

**మర్పల్లి , సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :** వేయిరోజుల కాంగ్రెస్ పాలనలో అనేక అభివృద్ధిపనులతో. పాటు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేష్‌యాదవ్ అన్నారు. శనివారంనాడు మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వికారాబాద్ నియోజక వర్గంలో జరుగుతున్న అభివృద్ధినిచూసి ఓర్వలేక కొందరు బిఆర్ఎస్ నాయకులు స్పీకర్ ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వాక్యలు చేయడం సరికాదన్నారు. సర్పంచ్ రామేశ్వర్, పరుశురాం, రఫి, రాజు, జిల్లా నయకులు కృష్ణారెడ్డి, రవెందర్, సంజీవరెడ్డిలు సుబాస్‌యాదవ్, సురేష్, మాట్లాడుతు పది సంవత్సరాల కాలంలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన బిఅర్ఎస్‌కు కాంగ్రెస్ చేసిన అభివృద్ధి కనిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. తల్లిపాలు తాగి రొమ్ము గుద్దినట్లు కాంగ్రెస్ పార్టీ పెట్టి బిక్షతో కొందరు ఉన్నత స్థానాలకు ఎదిగి తల్లిలాంటి కాంగ్రెస్ పార్టీపై దుమ్మెత్తి పోయడం వారి విజ్ఞతకు వదిలేస్తున్నామని వారు అన్నారు. ఈసమావేశంలో మధుకర్‌రెడ్డి, నాగేష్, ఉప సర్పంచ్ ప్రభు, లడూ, సురేష్. పలువురు సర్పంచ్‌లు పార్టీ కార్యకర్తలు పాల్గోన్నారు.

### చదువు ఆగిపోయిందా
## మళ్లీ బాట పట్టే అవకాశం !

**జవహర్‌నగర్, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:** చదువు మధ్యలో ఆపేసిన వారు, ఉద్యోగులు, గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత విద్య కొనసాగిం చేందుకు జవహర్‌నగర్‌లోని సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్‌లో డా. బి. ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ ఏర్పాటు చేసినట్లు డీఐజి డా. వీర్రాజు తెలిపారు. సీఆర్‌పిఎఫ్ మెన్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ పూర్తిచేసిన వారు ఈఅవకాశన్ని సద్వినియెగంచేసుకోవచ్చన్నారు. స్టడీ సెంటర్ ద్వారా బీఏ, బీకాం, బీఎస్సీ తదితర డిగ్రీ కోర్సులు చదువుకోవచ్చనితెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, విధానాల్లో తరగతులు నిర్వహించడంతో పాటు బ్రౌ టీవీ, టి శాట్, దూరదర్శన్ ద్వారా పాఠాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. విధుల్లో అంగవైకల్యానికి గురైన సీఆర్‌పిఎఫ్ జవాన్లకు ఫీజులో రాయితీ వంటి ప్రత్యేక సౌకర్యాలు ఉన్నాయని డీఐజీ తెలిపారు. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ 9లోగా దరఖాస్తుకు ఎస్సెస్సీ, ఇంటర్ లేదా డిప్లొమా సర్టిఫికెట్, ఆధార్ కార్డు అవసరమని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ కె. హరిశంకర్ (9959034477), క్లర్క్ కళ్యాణి రెడ్డి(7981837962) ను సంప్రదించాలని సూచించారు. వాట్సప్ కోసం 9441474923, నంబర్‌ను వినియోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కో ఆర్డినేటర్, సీఆర్‌పిఎఫ్ పబ్లిక్ స్కూల్ వైస్ ప్రిన్స్‌పల్ కె. హరిశంకర్ పాల్గొన్నారు.



ముఖద్వార ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న నాయకులు

## వెంకటేశ్వర స్వామి ముఖద్వార ఏర్పాటుకు భూమి పూజ

**కుల్కచర్ల, సెప్టంబరు 5, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు సేవా భావం కలిగి ఉండాలని ఏపిఎస్‌ఎస్ ఛైర్మన్ భీంరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని తీర్మలాపూర్ గ్రామ గేట్ సమీపంలో శ్రీవెంకటేశ్వరస్వామి ముఖద్వారం ఏర్పాటుకు తిర్మలాపూర్ గ్రామ కిర్తిశేషులు' అచ్చన గౌడ్ జ్ఞాపకార్థంగా కుమారుడు శ్రీనివాస్ గౌడ్ స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేసి పనులకు శ్రీకారం చుట్టారు. ఆలయానికి ముఖద్వారం ఏర్పాటు చేయడం ద్వారా భక్తులకు మరింత సౌకర్యం కలగడంతో పాటు ఆలయ ప్రాంగణానికి మరింత శోభ చేకూరుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్ భరత్ కుమార్ రెడ్డి, బోట్యానాయక్ తాండ సర్పంచ్ సంతోష్ నాయక్, కాంగ్రెస్ నాయకులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం
### డివిజన్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు మాధవి

**ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 5, ప్రభాత వార్త:** ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పోచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు ఏర్ర మాధవి అన్నారు. పోచారం డివిజన్ నారపల్లిలో శనివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన స్మార్ట్ రేషన్‌కార్డులను లబ్దిదారులకు మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం గత పదేండ్లు పరిపాలనా చేసిన పేదలకు రేషన్‌కార్డులు పంపిణీ చేయలేదని అన్నారు. కొత్తగా కార్డులు అందజేసిన పాపాన పోలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎండీ. షబ్బీర్, గ్రామ శాఖ అధ్యక్షుడు నిజాంఖాన్, ఏర్ర రాజు తదితరులు పాల్గొన్నారు.



నారపల్లిలో స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్ర మాధవి

## నీటిని ఒడిసిపట్టడమే లక్ష్యం

**జిల్లేడు చౌదరిగూడెం, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** వర్షాలకు వచ్చిన నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని టెక్నికల్ అసిస్టెంట్ కొండల్ అన్నారు. శనివారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని గాలిగూడ, ధర్మ్యాతాండా గ్రామ పంచాయితీలలో ఏర్పాటు చేసిన విబి జిరామ్‌జి ప్రత్యేక గ్రామసభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ విబిజిరామ్‌జి పథకం ద్వార రైతులకు ఉపయోగపడే అనేక పనులు ఉన్నాయని అన్నారు. ఐదు ఎకరాల లోపు భూమి కలిగివున్న ప్రతి రైతు తమ పొలాల్లో పనులు చేసుకోవచ్చని అన్నారు. ప్రతి రైతుకు ప్రభుత్వం రెండు లక్షల వరకు ఉచితం పనులు చేస్తుందని పెర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి రైతు సద్వి నియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు స్వప్న సత్యం, చంద్యనాయక్, పంచాయితీ కార్యదర్శి ఆరాదన, తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న టెక్నికల్ అసిస్టెంట్ కొండల్

# కాంగ్రెస్ విజయోత్సవ బైక్ ర్యాలీ



పూడూరులో జరిగిన బైక్ ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**కాంగ్రెస్ విజయోత్సవ బైక్ ర్యాలీలో కడుమూరు ఆనందం**

**పూడూరు, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** కాంగ్రెస్‌పార్టీ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీపై పెట్టిన అక్రమకేసులను వెంటనే ఎత్తివేయాలని వికారాబాద్ జిల్లా కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యక్షుడు కడుమూరు ఆనందం డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 1000రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా అది ష్టానం ఆదేశాలమేరకు మండల పార్టీ అధ్యక్షుడు సురేందర్ అద్వర్యంలో శనివారం పూడూరు మండల కేంద్రంలోని అంబేద్కర్‌చౌరస్తానుండి మన్నెగూడ చౌరస్తా వరకు కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు భారీగా ప్రజాపాలన విజయోత్సవ బైక్‌ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మతతత్వ బిజెపి ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్‌ఖర్గెను అవమానించడమే కాకండా దళితులపట్ల చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. పేపర్‌లీక్‌తో నిరసనలు చేస్తున్న విద్యార్థులకు మద్దత్తు తెలిపిన రాహుల్‌గాంధీపై కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసని ప్రశ్నించారు

ఈ కార్యక్రమంలో ఆత్మాకమిటీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్‌పార్టీ కార్యదర్శులు అజీంపటేల్, పెంటయ్య, శ్రీనివాస్, సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఖిజర్‌పాష, సర్పంచులు గోపాల్, రాంచెంద్రయ్య, నాయకులు కొనింటి మల్లేశం, చిన్న నారాయణ, ఎం సురేష్, సుభాష్, శ్యాంసుందర్‌రెడ్డి సుధాకర్‌రెడ్డి, పలు గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు జరిగే కాంగ్రెస్ బైక్ ర్యాలీని విజయవంతం చేయండి
### పోచారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్



అన్నోజిగూడలో జరిగిన పోచారం డివిజన్ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న డివిజన్ పార్టీ అధ్యక్షుడు రాజేష్.

**ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:**
సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన వెయ్యి రోజులు అయిన సందర్భంగా పోచారం డివిజన్ పరిధిలో ఈ నెల 6 వ తేదిన చేపట్టదలిచిన బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రె రాజేశ్ పిలుపునిచ్చారు.

పోచారం డివిజన్ పరిధిలోని అన్నోజిగూడ ప్యాట్ బాయ్ కోర్టు ఆవరణలో శనివారం ముఖ్య కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేశ్ మాట్లాడుతూ బైక్ ర్యాలీ నారపల్లి పార్టీ కార్యాలయం నుండి ఉదయం 9 గంటలకు ప్రారంభమౌతుందని అక్కడి నుండి పోచారం, సంస్కృతి టౌన్‌షిప్, అన్నోజిగూడ, యంనంపేట్, ఇస్మాయిల్ ఖాన్‌గూడ తిరిగి అన్నోజిగూడలోని రాజీవ్ గృహకల్ప కాలనీ, చౌదరిగూడ సంస్కృతి టౌన్‌షిప్, చౌదరిగూడ గ్రామం మీదుగా వెంకటాపూర్, కొర్రెముల, ప్రతాప సింగారం నుండి కాచవాని సింగారం వరకు ర్యాలీ ఉంటుందని తెలిపారు.

పెద్దఎత్తున ర్యాలీలో కార్యకర్తలు తమ బైకలతో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ వర్కింగ్ అధ్యక్షులు మెట్టు గణేశ్‌యాదవ్, భోజిరెడ్డి, మాజీ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పసులాది నర్సింగ్ ముదిరాజ్, యుగంధర్‌రెడ్డి, మల్లిఖార్జున్‌రెడ్డి, ఆంజనేయులు గౌడ్, ఎం. సుధాకర్, బీఎన్. రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సేవలు ప్రశంసనీయం

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** పవిత్రమైన ఉపాధ్యాయవృత్తిలో కొనసాగుతున్న టీచర్ల సేవలు అభినందనీయమని మాజీ వార్డుసభ్యులు కంచర్ల వెంకట్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్‌లోని ఉర్దూమీడియమ్ పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉర్దూ టీచర్ రెజ్వానాను వెంకట్‌రెడ్డి శాలువా, పూలదండలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులకు మెరుగైన విద్యాభోదన చేయాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో అప్సానా, ఇర్ఫాన్‌లు పాల్గొన్నారు.



## డిగ్రీ ప్రవేశాలకు ఆహ్వానం

**బేగంపేట, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :**
డా. బి. ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (బ్రాపూ)ఆధ్వర్యంలో 2026.27విద్యాసంవత్సరానికి గాను డిగ్రీ. పీజీ ప్రవేశాల ప్రక్రియ కొనసాగు తుందని, బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. పద్మావతి తెలియజేసారు. దూర విద్య ద్వారా ఉన్నత విద్యను అభ్యసించాలని అనుకునే మహిళా విద్యార్థినులకు ఇదొక చక్కటి అవకాశం అన్నారు. ఈ విద్యా కేంద్రంలో బీఏ, బీకాం, బీఎస్సీ వంటి అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులతో పాటు ఎంఏలో ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ , సోషియాలజీ, తెలుగు, ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ ప్రోగ్రామ్‌లు కేవలం మహిళలకు మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వారు, ఓపెన్ ఇంటర్ మూడేళ్ల పాలిటెక్నిక్ డిప్లమా లేదా ఐటీఐ ఉత్తీర్ణులైన వారు ఈ డిగ్రీ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని స్పష్టం చేసారు. గత విద్యా సంవత్సరంలో అడ్మిషన్ పొందిన 2వ, 3వ సంవత్సరం విద్యార్థులు తమ ట్యూషన్ ఫీజును చెల్లించవచ్చని, గతంలో సకాలంలో ఫీజు చెల్లించలేక పోయిన వారు కూడా ఇప్పుడు బకాయిలను చెల్లించే అవకాశం కల్పించినట్లు స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ డా. మారోజు రామాచారి తెలియజేసారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సెప్టెంబరు 9 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం బేగంపేట లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల స్టడీ సెంటర్ ను సంప్రదించాలని కోరారు.

## విద్యార్థుల్లో వ్యక్తిత్వాన్ని నిర్మించే మార్గదర్శకులు

**బేగంపేట, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :**
ఉపాధ్యాయులు విద్యను బోధించే వారు మాత్రమే కాదని, విద్యార్థుల్లో వ్యక్తిత్వాన్ని నిర్మించే మార్గదర్శకులు అని పాఠశాల కరస్పాండెంట్ మహ్మద్ మదస్సిర్ జుహా అన్నారు. బేగంపేట ప్రకాశంనగర్ మన్సూరా సైబర్ హైస్కూలు లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్దులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను కరస్పాండెంట్ మహ్మద్ మదస్సిర్ జుహా సన్మానించారు. మాజీ వైస్ ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ మన్సూరా సైబర్ హైస్కూలు లో 26సంవత్సరాలు పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. సుష్మ, మహ్మద్ ముజమ్మిల్ జుహాతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ విచారణ కేంద్రాల తనిఖీ చేసిన
## అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వెంకటేశ్వర్లు రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:** తెలంగాణ అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర్లు రెడ్డి, శనివారం ఎస్ఐఆర్ విచారణ కేంద్రాలను తనిఖీ చేశారు. యూసుఫ్‌గూడలోని ప్రభుత్వ పాఠశాల, నాగార్జున కమ్యూనిటీ హాల్‌లో నిర్దేశించిన విచారణ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బిఎల్‌వో సూపర్‌వైజర్లు సహాయ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి (ఏఈఆర్ఓ)లతో మాట్లాడి, అన్‌మ్యాపింగ్ పత్రాల ధృవీకరణ పురోగతి గురించి ఆరా తీశారు. ఓటర్లు సమర్పించిన పత్రాలను స్వీకరించడానికి పరిశీలించడానికి జరుగుతున్న ఏర్పాట్లను ఆయన సమీక్షించి కేసుల పరిష్కారానికి సంబంధించిన వివరాలను కోరారు. విచారణ ప్రక్రియ సమయంలో ఓటర్లందరికీ సరైన సహాయం అందేలా చూడాలని నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పత్రాల ధృవీకరణ జాగ్రత్తగా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈఆర్ఓ61లో ఎస్ఐఆర్ కింద ప్రత్యేక ప్రచారాన్ని నిర్వహించడానికి చేసిన సన్నాహాలను సమీక్షించి, ఓటర్లలో అవగాహనను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు.



లబ్ధిదారులకు రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

**కేశంపేట, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి కేశంపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణ వేదికైంది. శనివారం నిర్వహించిన కార్యక్రమాన్ని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత సులభంగా చేరేందుకు స్మార్ట్ రేషన్ కార్డులుఉపయోగపడతాయని పేర్కొన్నారు. గత పాలకుల పది సంవత్సర పాలనలో ఒరుగబెట్టింది ఏమి లేదని లక్షల కోట్ల అప్పు మాత్రం చేశిందని, కాంగ్రెస్ ప్రభుత్వంఅధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే అనేక పథకాలను తీసుకొని వచ్చి ప్రజలకు మంచి పాలనను అందిస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. అనంతరం లబ్ది దారులకు 3500 ల స్మాట్ రేషన్ కార్డులను అందజేశిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్. ఈ అవకాశాన్ని ప్రజలు ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అయన సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల అధ్యక్షుడు అధ్యక్షుడు అనుమగళ్ళ రమేష్, మాచి జెడ్పిటిసి విశాలా శ్రవణ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు వీరేశం, పిఎసిఎస్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు గుండె రాణి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు అనసూయ, బిసా కవిత కరుణాకర్ రెడ్డి, శశిరేఖ యాదయ్య, జగదీశ్వరప్ప, సురేష్ రెడ్డి, పల్లె ఆనంద్ కుమార్, రావుల పెంటయ్య ముదిరాజ్, ఎరుపుల లింగం ముదిరాజ్, తుమ్మల గోపాల్ ముదిరాజ్, కోడూరు రాములు, రాజేందర్ రెడ్డి, భాస్కర్ నాయక్, భాస్కర్ గౌడ్, త్రైత పర్వతాలు, సువర్ణ చిన్న నర్సింలు, కరుణాకర్, కోడూరు నర్సింలు, తాళ్ల నరసింహులు గౌడ్, ఎండి అమీర్, నరేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రమణ గౌడ్, రాములు , గిరి యాదవ్, జంగయ్య, జట్టూరి జయమ్మ నాగిరెడ్డి, భీమయ్య, ప్రకాష్, ఎగిరే నాగేశ్వర్, అధికారులు, స్థానిక తహసిల్దార్ రాజేందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి ఓర్వలేకనే బిఆర్ ఎస్ అవాస్తవాల లొల్లి

**తలకొండపల్లి , సెప్టెంబరు 5, ప్రభాతవార్త :**
తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికా ఈరంలోకి వచ్చాక అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వంలోని మంచి పనులను సైతం అమలు చేస్తూ మరిన్ని మంచి పనులు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం నాడు తలకొండపల్లి మండల పరిధిలోని లింగరావుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో సింగల్ విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. గ్రామంలోని బోర్ గడ్డ వీరాంజనేయ స్వామి పదో వార్షికోత్సవం సందర్భంగా దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం రామకృష్ణాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఐదు ఇందిరమ్మ ఇండ్లను, గ్రామంలో 40 లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం నూతనంగా మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డ్ లను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అనేక సంక్షేమ పనులు నిర్వహిస్తున్న కొంతమంది లేనిపోని ఆరోపణలతో గోల గోల చేస్తూ వ్యతిరేకిస్తున్నారని ఆయన విమర్శించారు. ఇటీవల బి ఆర్ఎస్ కు చెందిన ఒక నాయకుడు తనను రాజీనామా చేయమంటున్నాడు అని, నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు 1700 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు తీసుకొచ్చానని, అనేక గ్రామాల్లో సిసి రోడ్లు అండర్ డ్రైనేజీలు, నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు సైతం మంజూరు చేసి పనులు జరుగుతున్న వాళ్ళు ఓర్చుకోవడం లేదని ఎద్దేవ చేశారు. అప్పటి ప్రభుత్వంలోని అనేక మంచి పనులను తీసుకొని పెన్షన్లు, రైతు భరోసా పథకాలు అమలు జరుపుతున్నామని, ప్రస్తుతం ఎన్నికల్లో హామీ ఇవ్వని పేద ప్రజలకు సన్నబియ్యం, ఉచిత బస్సు సౌకర్యం అందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నామని ఆయన చెప్పుకొచ్చారు. నియోజకవర్గంలో అభివృద్ధి జరిగినా తనను రాజీనామా చేయమంటున్నారని తాను రాజీనామా చేశాక వారు ఏం చేస్తారని బి ఆర్ఎస్ నాయకులు ఎడమ సత్యం గురించి ఆయన విమర్శించారు. ఎమ్మెల్యే కుటుంబం లోని వ్యక్తి ఇలా మాట్లాడమేంటని ఆయన ఎద్దేవా చేశారు. నియోజకవర్గానికి 200 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు తెచ్చానని, ఎన్నో రోడ్లకు బీటీ రోడ్లుగా మార్చానని ఆయన చెప్పుకొచ్చారు. రామకృష్ణాపురం గ్రామంలో కేశవరెడ్డి చొరవతో అనేక అభివృద్ధి పనులు జరిగాయని పట్టు విడవని విక్రమార్కుడిలా జరిగాయని పట్టు విలువని విక్రమార్కుడుల పనులను చేయించుకుంటున్నట్లు కేశవరెడ్డిని ఉద్దేశించి తెలిపారు.

**అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే**

రామకృష్ణాపురం గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ మండల తాసిల్దార్ రమేష్ కుమార్, ఎంపీడీవో పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

తాసిల్దార్ రమేష్ కుమార్ నన్నేం చేస్తారని ట్రాన్స్ఫర్ చేసుకోండి అని ప్రజలతో దురుసుగా మాట్లాడుతున్నట్లు ఎమ్మెల్యేకు తెలపడంతో ప్రజలకు బాధ్యత తెలుపవలసిన అవసరం అధికారులకు నాయకులకు ఉందని, ఆ పని పై అధికారులు చూసుకుంటారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టం లేని చో మీరే బదిలీపై వెళ్లాలని, ఆగ్రం వ్యక్తపరిచారు. ఎంపీడీవో కనీసం కనీసం మాట్లాడే విషయాలను సైతం పట్టించుకోవడంలేదని, తాను ఇచ్చిన వినతులను ఎందుకు పరిశీలించడం లేదని ఆగ్రహం కొత్త పరిచయం భవిష్యత్తులో ఇలాంటి పరిణామాలు జరగకుండా పని చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ గట్ల కేశవ రెడ్డి, స్థానిక సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత నరసింహ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి భగవాన్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి భగవాన్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రఘురాములు, బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, ఎంపీడీవో సీతారామమ్మ, రెవెన్యూ అధికారులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, నాయకులు దేవిడ్, రమేష్ యాదవ్ శ్రీశైలం, రాజేందర్ నాయక్ జంగయ్య, నరసింహారెడ్డి, పవన్, తోపాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో లగచర్ల సురేష్ అరెస్ట్
### పోలీస్ స్టేషన్‌కు చేరిన బిఆర్ఎస్ లీగల్ అడ్వకేట్ టీమ్

**ధారూర్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** సిఎం రేవంత్ రెడ్డి కొడంగల్ పర్యటన సందర్భంగా లగచర్ల సురేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై రాజకీయ వర్గాలలో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. సిఎం పర్యటనల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణ, ముందస్తు చర్యల్లో భాగంగానే అనుమానితులను లేదా పాత కేసుల్లో సంబంధం ఉన్నవారిని నిబంధనల ప్రకారం అదుపులోకి తీసుకుంటున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే సురేష్‌ను ప్రశ్నించేందుకు విచారణ నిమిత్తం ధారూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించామని, తదనంతరం పరిపాలనా పరమైన, భద్రతా కారణాలరీత్యా అతన్ని బొమ్రాస్ పేట్ పీఎస్‌కు మార్చడం జరిగిందని పోలీసు వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు, ఈ చర్యను బిఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. ఎలాంటి సరైన కారణాలు లేదా ముందస్తు సమాచారం లేకుండా ప్రివెంటివ్ అరెస్ట్ పేరుతో పౌరులను ఇష్టానుసారంగా నిర్బంధించడం రాజ్యాంగ విరుద్ధమని బిఆర్ఎస్ లీగల్ సెల్ అడ్వకేట్ చైతన్య కిరణ్ ఆరోపించారు. ధారూర్ పోలీస్ స్టేషన్‌కు లీగల్ టీమ్ వెళ్లి నిలదీసే వరకు సురేష్‌ను ఎందుకు నిర్బంధించారనేదానిపై స్పష్టత ఇవ్వలేదని, చివరికి ప్రశ్నించడంతోనే వదిలేస్తామని చెప్పి మళ్లీ వేరే స్టేషన్‌కు తరలించడం ఏంటని ఆయన నిలదీశారు. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న సొంత జిల్లాలోనే పౌరుల హక్కులను కాలరాస్తున్నారని, రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలందరూ గమనించాలని బీఆర్ఎస్ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. శాంతిభద్రతల పరిరక్షణ కోసమే ముందస్తు చర్యలు చేపట్టామని పోలీసులు వాదిస్తుండగా, అధికార బలంతోనే అక్రమ నిర్బంధాలకు పాల్పడుతున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.



పోలీసులు అదుపులో లకచర్ల సురేష్, పక్కన మాట్లాడుతున్న లీగల్ అడ్వకేట్ చైతన్యకుమార్



నందిగామలో స్మార్ట్ కార్డు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.

## పేదల ఆత్మగౌరవం కోసమే స్మార్ట్ రేషన్ కార్డులు

**నందిగామ, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** స్మార్ట్ రేషన్ కార్డు ప్లాస్టిక్ కాదు.. పేదల ఆత్మగౌరం అని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. శనివారం నందిగామ మండల కేంద్రంలో తహసిల్దార్ సైదులు అధ్యక్షతన జరిగిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాయల మరాఠీ కెసిఆర్ మాటలతో సరిపెట్టి ప్రజల సొమ్ము కాజేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి కుంభకర్ణులా ఫామ్ హౌస్ లో పడక వేశారని ఎద్దేవా చేశారు. మీది ఫామ్ హౌస్ పాలన .. మాది ప్రజా పాలన అని, ఇచ్చిన మాట ప్రకారం లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించిన గజిట్ నెంబర్ 140 విడుదలే మా పనితీరుకు నిదర్శనం అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అర్హులైన పేద మధ్యతరగతి ప్రజల కోసం సరికొత్త స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. గత పదేళ్ల కాలంలో బిఆర్ఎస్ కుటుంబ పాలనలో ఏ ఒక్కరికి రేషన్ కార్డు, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. సర్పంచులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ చక్రధర్ గౌడ్, మాజీ ఎంపీ శివ శంకర్ గౌడ్, నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, సింగిల్ విండో చైర్మన్ కుందారం వెంకట్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార స్వామి గౌడ్, మాజీ ఎంపీటీసీ చంద్రపాల్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేతలు చెంది తిరుపతిరెడ్డి, పురుషోత్తం రెడ్డి, జిల్లెల్ల బాల్ రెడ్డి, ముబారక్, ఏఎంసీ డైరెక్టర్ నర్సింలు, సర్పంచులు గబ్రు చౌహాన్, బుగ్గ సాలయ్య, సి మల్లేష్, గోపాల్ గౌడ్, మాజీ సర్పంచ్ జటావత్ రాజు నాయక్, నాయకులు విగ్నేష్ రెడ్డి, సుక్య నాయక్, గుండాల వేణుగోపాల్, బుయ్యని వీరేందర్ గౌడ్, గుండాల అనిల్ కుమార్ గౌడ్, అన్వర్ పాషా, గడ్డం జంగయ్య, నందిగామ వార్డు సభ్యులు అగ్గిప్రసాద్, అగ్గి మమత సూరి, శివగళ్ల ప్రవీణ్, శివగళ్ల సురేష్, చించేటి లత శివ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కేశమోని రామచంద్రి, నరేందర్ రెడ్డి, చించేటి కృష్ణ గౌడ్, అభిరామ్, డైరెక్టర్ జంగయ్య, ప్రభయ, తడకల జంగయ్య, బి కృష్ణ యాదవ్, ఎర్రగారి రమేష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## అమ్మను కోల్పోవడం బాధాకరం..!
### అధైర్య పడొద్దు అండగా ఉంటామని భరోసా



మృతి చెందిన సర్పంచ్ గోవు అంజమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

**నందిగామ, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** నందిగామ మండలం రంగాపూర్ లో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన గోవు అంజమ్మ కుటుంబ సభ్యులు గోవు రవికుమార్ సోదరులను శనివారం సాయంత్రం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరామర్శించారు. పెద్దమ్మ చనిపోవడం బాధాకరమని ఆయన విచారం వ్యక్తం చేశారు. అధైర్య పడొద్దని అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. రెండు పర్యాయాలు రంగాపూర్ ప్రజలకు ఆమె అందించిన సేవలను కొనియాడారు. పరామర్శించిన వారిలో మాజీ ఎంపీపీ ఏం శివశంకర్ గౌడ్, సర్పంచులు కొమ్ము కృష్ణ, సిడి తండా సర్పంచ్ గబ్రు చౌహాన్, కొత్తూరు కౌన్సిలర్ సుదర్శన్ గౌడ్ ,మాజీ సర్పంచ్ జటావత్ రాజునాయక్ , రంగాపూర్ ఉపసర్పంచ్ బసవరాజ్ , నవపేట రవికుమార్ గౌడ్ , కావలి కృష్ణ, తోట హనుమంతరావు, జ్ఞానేశ్వర్ , జింకల శ్రీనివాస్ యాదవ్ , వార్డు సభ్యులు శాంతి శ్రీను,, అన్వర్ పాష, మల్లేష్, సీతారాం, తదితరులు పాల్గొన్నారు.